


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

సోమవారం 8 జూన్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 1




# ఈనెల 20 వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్

-లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
-రాజీయే రాజ మార్గము.

భానుపురి/ సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

20 తేది రోజు జరిగే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ కోరారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఈ నెల 20 వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, డ్రంకన్ డ్రైవ్ కేసులు, మోటారు ట్రాన్స్పోర్ట్ రోడ్డు నిభందనలు ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ ఇలా రాజిపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ చేసుకోవచ్చు అని తెలిపినారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృదా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు సంభందిత పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది



అని ఎస్పి అన్నారు.

# కలం అమ్ముడైతే ప్రజాస్వామ్యం అంధకారం!

-జనం కోసం పుట్టిన కలం... జేజేలు కొట్టే వాయిద్యమైందా?
-ప్రశ్నించే కలం కావాలా? ప్రశంసించే కలం కావాలా?
-నాలుగో స్తంభం కదిలిందా? జర్నలిజం ఆత్మ ఏమైంది?
-ప్రజల కన్నీటి కంటే నాయకుడి పుట్టినరోజు ముఖ్యమా?

భానుపురి

వార్త చనిపోతే నిజం చస్తుంది -- కలం ఇంకా ప్రజల వైపే ఉందా?

జనం కోసం పుట్టిన కలం... జేజేలు కొట్టే వాయిద్యమైపోతుందా?

ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల తర్వాత నాలుగో స్తంభంగా మీడియాకు గుర్తింపు ఉంది. ఆ మీడియాకు ప్రాణం జర్నలిస్టు. ఒకప్పుడు విలేకరి అంటే ప్రజల తరఫున నిలబడే వ్యక్తి. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, అధికారాన్ని నిలదీసే స్వరం, బాధితుడి కన్నీటిని సమాజానికి చూపించే అద్దం.

కానీ నేడు సమాజం ముందు ఒక ప్రశ్న నిలుస్తోంది: జర్నలిస్టు జనం జాబితాలో ఉన్నాడా? లేక జేజేలు కొట్టే జాబితాలో చేరిపోయాడా?

ఒకప్పుడు గ్రామానికి జర్నలిస్టు వస్తున్నాడంటే అధికారులు అప్రమత్తమయ్యేవారు. ప్రజలు ఆశగా ఎదురుచూసేవారు. తమ కష్టాలు వెలుగులోకి వస్తాయని నమ్మేవారు. కానీ నేడు కొన్నిచోట్ల పరిస్థితి తారుమారైంది.

ప్రజల సమస్యలు కనిపించవు, కన్నీళ్లు వార్తలు కావు, ఆవేదనలు హెడ్డింగ్‌లు కావు.

కానీ నాయకుడి పర్యటనకు బ్యానర్ వార్త, అధికారి రిబ్బన్ కత్తిరిస్తే మొదటి పేజీ కథనం, నాయకుడి పుట్టినరోజుకు ప్రత్యేక స్టోరీ.

తాగునీటి కోసం కిలోమీటర్లు నడిచే మహిళ, పంట నష్టపోయి కుమిలే రైతు, ఉద్యోగం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే యువకుడు, వైద్యులు లేక అవస్థపడే రోగి, ఉపాధ్యాయుల కొరతతో ప్రశ్నార్థకమయ్యే విద్యార్థి భవిష్యత్తు -- ఇవన్నీ వార్తలు కావాల్సిన అంశాలు.


కానీ దురదృష్టవశాత్తు ప్రజల కష్టాల కంటే అధికారుల కార్యక్రమాలకే ఎక్కువ ప్రాధాన్యం దక్కుతోంది. ఇది జర్నలిజమా? లేక ప్రచార యంత్రమా? జర్నలిస్టు పని నాయకులను ప్రేమించడం కాదు, ద్వేషించడం కాదు. ప్రజల తరఫున ప్రశ్నించడమే జర్నలిజం ధర్మం.

తప్పు చేసినవాడు మంత్రి అయినా వార్త, ఎమ్మెల్యే అయినా వార్త, అధికారి అయినా వార్త, సామాన్యుడు అయినా వార్త. వార్త ముందు అందరూ సమానమే.

కానీ నేడు ప్రశ్నించాల్సిన వారు ప్రశంసిస్తున్నారు, నిలదీయాల్సిన వారు నమస్కరిస్తున్నారు. డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బంది పడితే వార్త కాదు, డ్రైనేజీ ప్రారంభోత్సవం మాత్రం ప్రధాన వార్త. ఆసుపత్రిలో వైద్యులు లేకపోతే వార్త కాదు, మంత్రి పర్యటన మాత్రం హెడ్‌లైన్. జర్నలిజం అంటే హారతులు పట్టడం కాదు, మాలలు వేయడం కాదు, సెల్ఫీలు దిగడం కాదు.

జర్నలిజం అంటే ప్రశ్నించడం, నిజాన్ని వెలుగులోకి తేవడం, బాధితుడి పక్షాన నిలబడటం, అధికార దుర్వినియోగాన్ని ఎండగట్టడం.

ఒకప్పుడు గొప్ప జర్నలిస్టులు జైళ్లు చూసినా నిజం రాశారు. బెదిరింపులకు వెనక్కి తగ్గలేదు. అందుకే వారి పేర్లు చరిత్రలో నిలిచాయి. ప్రకటనలు అవసరమే, మీడియా సంస్థలు నడవాలంటే ఆదాయం అవసరమే. కానీ ఆదాయం కోసం నిజాన్ని తాకట్టు పెడితే జర్నలిజం తన ఆత్మను కోల్పోతుంది. జర్నలిస్టు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి కావాలి. ఆ వారధి ప్రజల నుంచి అధికారుల వైపు మాత్రమే వంగితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. ఈరోజు అవసరమైంది భజన జర్నలిజం కాదు, ప్రజా పక్ష జర్నలిజం. సెల్ఫీలు కాదు, సత్యాలు సేకరించే




నోట్‌బుక్కులు.

చప్పట్లు కొట్టే కలాలు కాదు, ప్రశ్నించే కలాలు. అధికారానికి విధేయత కాదు, ప్రజల పట్ల బాధ్యత. ఒక నిజాయితీ గల జర్నలిస్టు వందమంది నాయకుల కంటే సమాజానికి ఎక్కువ ఉపయోగ పడతాడు. నాయకుడు పాలన చేస్తాడు, జర్నలిస్టు ఆ పాలనను ప్రజల తరఫున పర్యవేక్షిస్తాడు.

కలం అమ్ముడుపోయిన రోజు వార్త చనిపోతుంది. వార్త చనిపోయిన రోజు నిజం కనుమరుగవుతుంది. నిజం కనుమరుగైన రోజు ప్రజాస్వామ్యం బలహీన పడుతుంది.

అందుకే ప్రతి జర్నలిస్టు తనను తాను ప్రశ్నించుకోవాలి:

నేను ప్రజల కన్నీళ్లు రాస్తున్నానా? లేక అధికారుల కీర్తనలు రాస్తున్నానా?

నేను బాధితుడి పక్షాన నిలుస్తున్నానా? లేక బలవంతుడి నీడలో నిలుస్తున్నానా?

నేను వార్తలు రాస్తున్నానా? లేక ప్రచార పత్రాలు తయారు చేస్తున్నానా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పుకున్న రోజే జర్నలిజానికి మళ్లీ గౌరవం వస్తుంది.

ప్రజల కోసం రాసిన అక్షరం చరిత్రలో నిలుస్తుంది. అధికారుల కోసం రాసిన పొగడ్త మరుసటి రోజే మరచిపోతారు. నాయకులు మారుతారు, అధికారులు మారుతారు, ప్రభుత్వాలు మారుతాయి.

కానీ ప్రజల కన్నీటిని అక్షరంగా మార్చిన వార్తలు, ప్రజల కోసం పోరాడిన జర్నలిస్టులు, నిజం కోసం నిలిచిన కలాలు మాత్రం శాశ్వతంగా నిలిచిపోతాయి

# బండారు శ్రీనివాస్‌ను సన్మానించిన మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్

భానుపురి/సూర్యాపేట టౌన్

తెలంగాణ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీపీటీఎఫ్) జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బండారు శ్రీనివాస్‌ను ప్రముఖ విద్యావేత్త కాసర్ల వీరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కక్కిరేణి శ్రీనివాస్ మాట్లాడుతూ, “బండారు శ్రీనివాస్ నాయకత్వంలో టీపీటీఎఫ్ సంఘం మరింత బలోపేతం అవుతుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సంఘ భవన నిర్మాణం కోసం ఆయన చిత్తశుద్ధితో కృషి చేస్తారని ఆకాంక్షిస్తున్నాను. ఉపాధ్యాయ వర్గం సంక్షేమే లక్ష్యంగా ఆయన పనిచేయాలని కోరుకుంటున్నాను” అని అన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ, సంఘం ఇచ్చిన ఈ బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తున్నానని తెలిపారు. “సంఘ నిర్మాణం కోసం నా వంతు పాత్రను పూర్తి నిబద్ధతతో పోషిస్తాను. టీపీటీఎఫ్ సంఘ భవన నిర్మాణానికి నా వంతు సహకారం అందించడమే కాకుండా, సంఘ సభ్యులందరి సహకారంతో ఈ కార్యాన్ని త్వరగా పూర్తి చేస్తాను. మీ అందరి మద్దతుతో సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సామాజిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాను” అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై



సమిష్టిగా పోరాడి పరిష్కారం సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వార్డ్ సభ్యులు:రమేష్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రమణ, వీరయ్య, కృష్ణంరాజు, పిన్నెల్లి వెంకటేష్, ప్రభాకర్, రమేష్, అశోక్, రేవన్ తదితరులు పాల్గొన్నారు.




## టీపీటీఎఫ్ జిల్లా నూతన అధ్యక్షుడిగా బండారు శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక

భానుపురి/సూర్యాపేట టౌన్



తెలంగాణ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీపీటీఎఫ్) జిల్లా కార్యవర్గ సమావేశంలో బండారు శ్రీనివాస్‌ను జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు రాపర్తి రామ నరసయ్య గ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘ బలోపేతం, విద్యా సంవత్సర సభ్యత్వ నమోదు కార్యక్రమంపై చర్చించారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 27 వేల పాఠశాలలను 4 వేల పాఠశాలలుగా కుదించాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ నిరుపేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో బండారు శ్రీనివాస్‌ను నూతన జిల్లా అధ్యక్షుడిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ “సంఘ నిర్మాణం కోసం నా వంతు బాధ్యతగా పనిచేస్తాను. టీపీటీఎఫ్ సంఘ భవన నిర్మాణానికి అందరి సహకారంతో కృషి చేస్తాను. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, సామాజిక అంశాలపై పోరాటానికి నా వంతు పాత్ర పోషిస్తాను” అని తెలిపారు.

## కరాటే ఆత్మ రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుంది



భానుపురి /సూర్యాపేట

కరాటే ఆత్మ రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద సుమన్ షోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే దు అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ జె.వి రమణ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎల్లో బెల్ట్ 25 మంది విద్యార్థులు , ఆరెంజ్ బెల్ట్ 7 విద్యార్థులు, గ్రీన్ బెల్ట్ ముగ్గురు విద్యార్థులు, బ్లూ బెల్ట్స్ ముగ్గురు విద్యార్థులు, బ్రౌన్ బెల్ట్స్ ఒకరు తో పాటు శిక్షణ పొందిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో బాలికలు తమ ఆత్మ రక్షణ కోసం కచ్చితంగా కరాటే నేర్చుకోవాలని సూచించారు. కరాటే తో శారీరక దారుఢ్యం,మేదో సంపత్తి ఎంతగానో పెరుగుతుందన్నారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. నేటి యువత గంజాయి కి మత్తు పదార్థాలకు బానిస కాకుండా కరాటే వంటి స్పోర్ట్స్ పై ఆసక్తి పెంచు కోవాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ఆసక్తిని గమనించి ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా మాట్లాడుతూ కరాటే అంటే ఎలాంటి ఆయుధాలు లేకుండా చేతులతో తనను తాను రక్షించుకునే గొప్ప విద్య అని తెలిపారు. కరాటే నేర్చుకోవడం వల్ల మెదడు చురుకుదనం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ నామ అరుణ ప్రవీణ్, కరాటే శిక్షకులు జె వి రమణ, శ్రీమన్నారాయణ, రిషికేష్, హర్షవర్ధన్ విద్యార్థులు పాల్గొన్నారు